ఊపందుకున్న అభివృద్ధి పనులు



ధర్మపురిలో పూర్తయిన ఇందిరమ్మకాలనీ ప్రవేశ ద్వారం


కాలనీలో చిల్డ్రన్స్ పార్కు

ధర్మపురి: సరిపడా రోడ్లు, నీటి వసతుల్లేక పిచ్చిమొక్కలు, ముళ్ల కంచెలతో నిండిపోయిన ఇందిరమ్మ కాలనీని అతి సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవతో టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరు కాగా.. పనులు వేగవంతం చేశారు. ధర్మపురిలోని కమలాపూర్ వెళ్లే రహదారిలో ఉన్న ఇందిరమ్మకాలనీ అభివృద్ధి పనులతో మెరిసిపోతోంది. ఇందులో భాగంగా రూ.9.15కోట్లతో ఏడు కిలోమీటర్ల సీసీ రోడ్లు, వివిధ వార్డుల్లో పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందిరమ్మకాలనీలో రూ.30లక్షలతో నిర్మిస్తున్న చిల్డ్రన్ పార్కు పనులు పూర్తి దశకు చేరాయి. రూ.20లక్షలతో కాలనీ ముందు భాగంలో ఇందిరమ్మ పేరుతో ఆర్చీ గేటును నిర్మించారు. ముఖ్యంగా ధర్మపురిలో శాశ్వత మంచినీటి సౌకర్యం కోసం అమృత్ 2.0 ద్వారా రూ.23కోట్లు మంజూరు కాగా.. 6, 7 లక్షల కెపాసిటి గల రెండు నీటి ట్యాంకులు, 25 కిలోమీటర్ల పైపులైను పనులు కొనసాగుతున్నాయి. ధర్మపురిలో ఎస్‌బీఎం 2.0 ద్వారా గోదావరి ఒడ్డున మురుగు నీటి శుద్ధి కేంద్రం కోసం రూ.25.40కోట్లు మంజూరు కాగా.. పనులు టెంబర్ దశలో ఉన్నాయి. మంత్రి చొరవతో సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, ఇంటర్నల్ రోడ్లు, డ్రైనేజీలు చేపట్టనున్నారు.



పెగడపల్లి: పెగడపల్లిలో నిర్మిస్తున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనం అర్ధాంతరంగా నిలిచిపోయింది. భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సేవలందిస్తున్నారు. గత ప్రభుత్వం రూ.20లక్షలు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు చేసిన మేరకు బిల్లు చెల్లింపు కాకపోవడంతో చేతులెత్తేశాడు. పనులు నిలిచి ఏడాది దాటినా సంబంధిత అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో వెచ్చించిన నిధులు నిరుపయోగమౌతున్నాయి. ఈ భవనం ప్రస్తుతం మోడల్ స్కూల్‌కు విద్యార్థులను తీసుకొచ్చే ఆటోలకు అడ్డాగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

మెట్‌పల్లి రూరల్: సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి దీపిక తెలిపారు. మెట్‌పల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో గురువారం మాట్లాడారు. సన్న, చిన్నకారు మహిళా రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, జనరల్ కేటగిరీ వారికి 40 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. కావాల్సిన రైతులు దరఖాస్తు పత్రం, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్‌తో నడుపు యంత్రాలకు ఆర్‌సీ జిరాక్సులను జతపరచాలన్నారు.

గొల్లపల్లి: ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ ఉపకరణాల పథకం కింద రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేస్తోందని, ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బొట్ల కరుణ తెలిపారు.

ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలి


పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

కథలాపూర్: గ్రామాల్లో ప్రజలందరూ కలిసిమెలిసి ఉండాలని మండలాధికారులు అన్నారు. గురువారం భూషణరావుపేటలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. అధికారులు ఎస్సీకాలనీలో పర్యటించి వారి సమస్యలడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ ఆవరణలో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఏమైనా కుల వివక్ష చూపిస్తున్నారా అనే విషయాలడిగి తెలుసుకున్నారు. అధికారులు మద్దెల నాగేశ్, వినోద్, ఎండీ గఫూర్, ఏఎంసీ డైరెక్టర్ వాకిటి రాజారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి, స్వామిరెడ్డి, అశోక్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


భూషణరావుపేటలో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ

కథలాపూర్: గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాలల నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా చేపట్టారు. యువత, విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాలకు బానిసై అనారోగ్యాలపాలు కావద్దని నినాదాలు చేశారు. ఆర్‌బీఎస్‌కే కోరుట్ల క్లస్టర్ వైద్యాధికారి సురేంద్ర, హెచ్‌ఎంలు రాజయ్య, రాజేందర్, ఉపాధ్యాయులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న దాతలు

రాయికల్: పట్టణంలోని శివాలయంలో నిర్మిస్తున్న వసతిగృహం నిర్మాణానికి దాతలు సామల్ల రాజకిరణ్, రాజ్‌చరణ్, రాజ్‌కరణ్ రూ.లక్ష ఆర్థిక సాయం చేయగా.. గురువారం భూమిపూజ చేశారు. శివ సేవకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతో బోరు

కొడిమ్యాల: ఎస్సీకాలనీ బ్రిడ్జి సమీపంలోని వైకుంఠధామం వద్ద ఎంపీ లాడ్స్ నిధులతో బోరు వేయించారు. గ్రామ అవసరాల కోసం అడగగానే నిధుల విడుదలకు చొరవ చూపిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి మాజీ సర్పంచ్ ఎలేటి మమత–నర్సింహరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నరేశ్, కొండయ్య, చిరంజీవి, అనిల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత

జగిత్యాలరూరల్: బాలికల విద్యతోనే సాధికారత సాధ్యమని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న, గౌతమి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం సంగంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. లింగ సమానత్వం, లింగ వివక్షత లేకుండా చూడాలన్నారు. చిన్నపిల్లల్లో మానసిక ఒత్తిడి, చదువులో అధిక ఒత్తిడి ఎలా జయించాలన్నదానిపై అవగాహన కల్పించాలన్నారు. బాలికలు, మహిళలు ఏదైనా ఇబ్బందికి గురైతే సఖీ హెల్ప్‌లైన్ నంబరు 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098, సైబర్‌క్రైమ్ నంబరు 1930లో సంప్రదించాలన్నారు. హెచ్‌ఎం పడాల రవీందర్, షీటీం కానిస్టేబుల్ మంజుల, తేజస్ ఫౌండస్ మెంబర్ రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల సూచనల మేరకే ఇళ్లు నిర్మించాలి


లబ్ధిదారులతో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

సారంగాపూర్: పేదలకు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తోందని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం కోనాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారుల వద్దకు వెళ్లారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో హౌసింగ్ శాఖనే తొలగించిందని, దీంతో పేదలకు పది సంవత్సరాలుగా ఇళ్ల నిర్మాణం ఒక కలగా మిగిలిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు అధికారుల సూచనల మేరకు నిర్మాణం చేయాలని, బిల్లుల చెల్లింపుల్లో సమస్య ఉండదని సూచించారు. నాయకుడు ఆకుల రాజిరెడ్డి తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులు ప్రారంభించిన పనులను మధ్యలో ఆపకుండా కొనసాగిస్తే పెట్టుబడి తగ్గుతుందని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. గురువారం అర్పపల్లి గ్రామంలో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ బేతి పూర్ణచందర్‌రెడ్డి, లబ్ధిదారులు తదితరులున్నారు.

రాయికల్: ప్రభుత్వ నిబంధనల మేరకే లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్‌గౌడ్ సూచించారు. గురువారం 1వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. కాంగ్రెస్ వార్డు ఇన్‌చార్జి మహ్మద్ షాకీర్, సామల్ల లత, సాయికుమార్, మేనేజర్ వెంకట్, హౌసింగ్ ఏఈపీ తిరుమల, మున్సిపల్ సిబ్బంది రజాక్, శేఖర్ పాల్గొన్నారు.

మేడిపల్లి: భీమారం మండలం గోవిందారం గ్రామంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సందర్శించారు. దువాస నర్సుకు మంజూరైన రూ.25వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. తోకల నర్సయ్య, పుల్లూరి దేవయ్య, ఎనుగంటి హరీశ్, బక్కురి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీజీఎస్ ఆర్టీసీ



ధర్మపురి: ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం టీజీఎస్ ఆర్టీసీ జగిత్యాల డిపో అద్దె బస్సుల యజమానుల నూతన సంఘం మర్యాదపూర్వకంగా కలిసింది. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపింది. వేణుగోపాల్, చుక్క వేణుగోపాల్, సురేశ్, సభ్యులు తదితరులున్నారు.

గొల్లపల్లి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కేజీబీవీ నాన్‌టీచింగ్ వర్కర్స్ కలిసి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. గౌరై లస్మక్క, కళావతి, సంతోష, రాధ, శ్రీలత, లావణ్య, శంకరవ్వ, పుష్పలత పాల్గొన్నారు.

నానో యూరియా వైపు మొగ్గు చూపాలి


అవగాహన కల్పిస్తున్న ఏవో

ఇబ్రహీంపట్నం: రైతులు నానో యూరియా వైపు మొగ్గు చూపాలని ఏవో రాజుకుమార్ కోరారు. మండల కేంద్రంలో రైతులకు నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. ఏఈవో వినోద్ పాల్గొన్నారు.

సన్మానం


రవీందర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కథలాపూర్: తక్కళ్లపెల్లి జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పని చేసిన మోటూరి రవీందర్ విరమణ సన్మాన సభ గురువారం జరిగింది. ఆయన సేవలను పలువురు కొనియాడుతూ శాలువాలతో సన్మానించారు. ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎంలు అర్జున్, రాంప్రసాద్, భారతి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడిపల్లి: మండలంలో పది సంవత్సరాలుగా డీఆర్‌డీఏలో ఐకేపీ ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న గట్ల అశోక్ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా మెట్‌పల్లి మండలానికి బదిలీ అయ్యారు. అశోక్‌ను మండల అధికారులు సన్మానించారు. మేడిపల్లి, భీమారం మండలాల ఎంపీడీవోలు పద్మావతి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి మండల ఏపీఎంగా బాధ్యతలు తీసుకున్న శంకర్‌కు మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మాదం వినోద్ సన్మానించారు. నాయకులు చేపూరి నాగరాజు, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వెల్గటూర్: తాను విధులు నిర్వర్తించిన పదవికే వన్నె తెచ్చిన వ్యక్తి ఎంపీడీవో జక్కుల శ్రీనివాస్ అని జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ డీసీవో మనోజ్‌కుమార్ అన్నారు. ఎండపల్లి మండల కేంద్రంలో గురువారం వెల్గటూర్ ఎంపీడీవో శ్రీనివాస్ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ జెడ్పీ సీఈవో నరేశ్, ఏఎంసీ చైర్మన్ గోపిక, వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: పొరండ్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్నం రాంరెడ్డి గురువారం విరమణ చేయగా.. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సన్మానించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లింగన్న, చందు, మహేశ్ పాల్గొన్నారు.

మల్యాల: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎండీ హైమద్ భాషా విరమణ సందర్భంగా గురువారం రాత్రి ఎస్సై నరేశ్‌కుమార్, సిబ్బంది శాలువాతో సన్మానించారు.

బాధ్యతలు స్వీకరణ

మల్యాల: మండల సెర్ప్, ఐకేపీ ఏపీఎంగా మల్లాపూర్ మండలం నుంచి బదిలీపై వచ్చిన దేవరాజ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మల్యాల మండలంలో ఏపీఎంగా బాధ్యతలు నిర్వహించిన రాజయ్య కథలాపూర్‌కు బదిలీపై వెళ్లారు. దేవరాజ్‌కు కార్యాలయ సిబ్బంది, సీసీలు, వీవోఏలు శుభాకాంక్షలు తెలిపారు.

మధ్యాహ్న భోజనం బాగుంది..


మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎస్‌వో సత్యనారాయణ

బుగ్గారం: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి చిప్ప సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వంట చేసేవారు, పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, సీఆర్పీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి


మాట్లాడుతున్న ఎంఈవో దామోదర్‌రెడ్డి

మల్లాపూర్: కాలానుగుణంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ సాంకేతిక మార్పునకనుగుణంగా విద్యార్థులకు పాఠ్యాంశాలు అర్థమయ్యేలా బోధించాలని మండల విద్యాధికారి కేతిరి దామోదర్‌రెడ్డి సూచించారు. గురువారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు మండలాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రమోహన్‌రెడ్డి, ఆర్పీలు, 45 మంది ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న కిసాన్ సంఘ్ ప్రతినిధులు

సన్న వడ్ల బోనస్ చెల్లించాలి

జగిత్యాలఅగ్రికల్చర్/జగిత్యాలటౌన్: యాసంగిలో ప్రభుత్వం సేకరించిన సన్న వడ్లకు బోనస్ చెల్లించాలని కిసాన్ సంఘ్ ప్రతినిధులు కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుల పెట్టుబడి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బోనస్ డబ్బులు విడుదల చేయాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత


నగదు అందిస్తున్న రఘు

మేడిపల్లి: భీమారం మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించిన ద్యావనపెల్లి సరయు కుటుంబ సభ్యులకు భీమారం గ్రామస్తులు రూ.1,17,500 ఆర్థిక సాయం అందజేశారు. సరయుది నిరుపేద కుటుంబం కావడంతో కూతుళ్ల చదువు మధ్యలో ఆగిపోవద్దనే ఉద్దేశంతో ఆర్థిక సాయం చేసినట్లు మాజీ సర్పంచ్ చెక్కపల్లి అరుణ–రఘు తెలిపారు.

సెప్టెంబర్ 1 నుంచి నిరవధిక సమ్మె

జగిత్యాలటౌన్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ.పదివేల వేతనం, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేకుంటే సెప్టెంబర్ ఒకటి నుంచి నిరవధిక సమ్మె చేస్తామని ఏఐటీయూసీ అనుబంధం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఇన్‌చార్జి వెన్న మహేశ్ తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు, వేతన హామీ అమలు కోరుతూ చలో కలెక్టరేట్ చేపట్టారు. కలెక్టరేట్ ఏవో, డీఈవోకు సమ్మె నోటీసు అందించారు. ప్రతిరోజు రెండు కూరలు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్న అధికారులు.. పెండింగ్ బిల్లులపై స్పందించడం లేదన్నారు. ఈనెల 6, 7న జిల్లాకేంద్రంలో నిరాహార దీక్ష చేపడతామన్నారు. కార్మిక సంఘం ప్రతినిధులు వెల్మలపల్లి వెంకటాచారి, పద్మ, సరిత, గంగవ్వ, రుక్మ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: లక్ష్మీపూర్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఏఈ సుందర్ తెలిపారు. లక్ష్మీపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీపూర్, జాబితాపూర్, ధర్మారం, తిమ్మాపూర్ గ్రామాల్లో నిలిపేస్తున్నట్లు చెప్పారు.

విరమణ పొందినవారికి అండగా పోలీసు శాఖ


సన్మానిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలక్రైం: పోలీసు శాఖలో విరమణ పొందిన వారికి పోలీసు శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో గురువారం విరమణ పొందిన ఏఎస్సై చంద్రయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎండీ అహ్మద్‌పాషాను సన్మానించారు. చంద్రయ్య, అహ్మద్‌పాషాను పోలీసు వాహనంలో తీసుకెళ్లి పోలీసు బ్యాండ్ మేళాతో ఘనంగా వీడ్కోలు పలికారు. ఆర్‌ఐ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డులు అందజేత


రేషన్ కార్డు అందిస్తున్న అధికారులు, నాయకులు

మెట్‌పల్లి రూరల్: వెల్లుల రైతు వేదికలో మండలానికి చెందిన పలువురికి గురువారం రేషన్ కార్డులు అందజేశారు. అడిషనల్ కలెక్టర్ లత, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ నీత, ఏఎంసీ, సహకార సంఘం చైర్మన్లు గోవర్ధన్, తిరుపతిరెడ్డి, నాయకులు సాయిరెడ్డి, మురళీధర్ రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: లంబాడిపల్లి గ్రామంలో గురువారం లబ్ధిదారులకు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. గుర్రం వెంకన్న, ముత్యాల నర్సింహారెడ్డి, బల్కం గంగ మహేశ్, కట్కూరి కరుణాకర్, సిరిగిరి దుర్గాప్రసాద్, సిరిగిరి నారాయణ, గడ్డం దుర్గయ్య పాల్గొన్నారు.

తల్లి పాల వారోత్సవాలు విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న సీడీపీవో వీరలక్ష్మి

పెగడపల్లి: ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. పెగడపల్లిలో రెండో నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగిన సెక్టార్ సమావేశాన్ని సందర్శించారు. కేంద్రాలవారీగా రికార్డులు, చిన్నారుల హాజరు, టీహెచ్‌ఆర్ పంపిణీ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఏసీడీపీవో అరవింద, సూపర్‌వైజర్ మహేశ్వరి, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ లక్ష్మణ్, టీచర్లు పాల్గొన్నారు.

యోగాతో మేధాశక్తి


అవగాహన కల్పిస్తున్న మాధవరెడ్డి

రాయికల్: యోగాతో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని అంతర్జాతీయ యోగా శిక్షకుడు మాధవరెడ్డి అన్నారు. గురువారం ఇటిక్యాల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో యోగాసనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సంతోష్, గ్రంథాలయ దాత కాటిపల్లి నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ కాటిపల్లి గంగారెడ్డి పాల్గొన్నారు.



శ్రీశైలంలో ఎమ్మెల్యే పూజలు

జగిత్యాల: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ గురువారం శ్రీశైల మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కోడెలకు మొక్కు చెల్లించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఉన్నారు. ఆలిండియా వెల్మ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శాంతమ్మ నారాయణరావు భవన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా ఎమ్మెల్సీ రమణ కుమారుడి నిశ్చితార్థ వేడుకలకు హాజరయ్యారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు

కోరుట్ల: రైతులకు విక్రయించే యూరియా బస్తాల తోపాటు రూ.వెయ్యికి జింకు బస్తా ఇస్తున్నారని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తప్పుగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 2న అయిలాపూర్ రైతు వేదికలో రైతులతో చర్చ నిర్వహిద్దామని, ఎమ్మెల్యే హాజరు కావాలన్నారు.

కోతులతో పంటలకు నష్టం

జగిత్యాలరూరల్: జిల్లాలో కోతుల బెడదతో పంటలు తీవ్రంగా నష్టపోతున్నామని, కోతుల బెడదను నివారించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా అటవీ శాఖ అధికారి రవిప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు.